క్లుప్తంగా

సన్మానం



డీఎస్పీ ఉద్యోగం పొందిన రాణి కిరణ్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

మోతీనగర్: కృషి పట్టుదల ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడే ఏ రంగంలోనైనా విజయం సాధ్యమవుతుందని స్నేహపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి. వినోద్ అన్నారు. కాలనీకి చెందిన కాసుల రాణి కిరణ్ ఇటీవల విడుదలైన గ్రూప్ 1 పరీక్ష ఫలితాలలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించి డీఎస్పీగా ఉద్యోగం పొందింది. శుక్రవారం స్నేహపురి కాలనీలో ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు ఊటుకూరు శ్రీనివాస్ గుప్తా, సుభాష్, చలమారెడ్డి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



పారిశుద్ధ్య కార్మికులతో ధర్మారావు

మోతీనగర్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎంసీహెచ్‌ఎస్ మాజీ చైర్మన్ ధర్మారావు అన్నారు. దసరా సందర్భంగా మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని పారిశుద్ధ్య కార్మికులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు విరామం లేకుండా ప్రజలకు సేవ చేయడం అభినందనీయమన్నారు.

డీవీజీ ట్రస్టు ద్వారా ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో దయానంద్‌చారి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆదేశాల మేరకు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను స్థానిక నాయకులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఖలీమ్, ఫారూఖ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయం వద్ద అన్నదానం



జ్ఞానలాల్ కుస్వాహా, ద్రౌపతి దేవిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ

మోతీనగర్: అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పదని కుస్వాహా సమాజ్ హైదరాబాద్ శాఖ అధ్యక్షులు జ్ఞానలాల్ కుస్వాహా అన్నారు. విజయదశమి సందర్భంగా అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్ రోడ్డు నెంబర్ 7లోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో మహాన్నదానం కార్యక్రమాన్ని జ్ఞానలాల్ కుస్వాహా, ద్రౌపతి దేవి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాబోయే రోజుల్లో కూడా మరెన్నో మహాన్నదాన కార్యక్రమాలు నిర్వహించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

బీజేపీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాధవరం కాంతారావు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వి. రామారావు నగర్‌కు చెందిన హిందూ వాహిని కూకట్‌పల్లి బాగ్ కన్వీనర్ సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేయటం ఖాయమన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీకి ప్రజల ఆదరణ ఎంతో ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్. వెంకట్రామిరెడ్డి, సంతోష్, కృష్ణ శర్మ, వెంకటరెడ్డి, మురళీమోహన్, సూరి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలు అందేదెన్నడో..?

నిరుద్యోగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

- రాష్ట్ర అవతరణ రోజునే అందించాల్సిన వైనం
- 4 నెలలు కావస్తున్నా.. అందని మంజూరు పత్రాలు
- జిల్లాలో వచ్చిన దరఖాస్తులు 66,648



సాక్షి,మేడ్చల్ జిల్లా: జిల్లాలోని నిరుద్యోగ యువత రాయితీ రుణాల కోసం ఎదురు చూస్తున్నారు. ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల అధికారులు రాజీవ్ యువ వికాసం పేరిట దరఖాస్తులు స్వీకరించగా, ప్రభుత్వపరంగా ఉద్యోగాలు అంతంతమాత్రంగా ఉండడంతో ఈ పథకంతో స్వయం ఉపాధికి బాటలు వేసుకోవచ్చన్న ఉద్దేశంతో యువత పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు జూన్ 2న మంజూరు పత్రాలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో నిరుద్యోగ యువతలో హర్షతీరేకాలు వ్యక్తమయ్యాయి. అయితే 4 నెలలుగా ప్రభుత్వం మంజూరు పత్రాలు అందించకపోగా, అవి ఎప్పుడూ అందుతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది.

భారీగా దరఖాస్తులు

రాజీవ్ యువ వికాసం పథకానికి నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 66,648 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా బీసీ సామాజిక వర్గం నుంచి బీసీ కార్పొరేషన్ కింద 13,400 యూనిట్ల లక్ష్యం కాగా, 37,935 మంది అర్జీలు అందించారు. రూ.50 వేల యూనిట్‌కు బ్యాంక్ రుణంతో సంబంధం లేకుండా వంద శాతం రాయితీ ఉండనున్నది. మిగతా యూనిట్లకు గరిష్ఠంగా రూ. 4 లక్షల వరకు ఎంచుకునే అవకాశం కల్పించగా రాయితీ 70 శాతం ఉంటోంది.

కమిటీలు ఏర్పాటు చేసినా..

శాఖల వారీగా అందిన దరఖాస్తులను మండల, మున్సిపల్ స్థాయి కమిటీలు పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. కమిటీల్లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల, పట్టణ ప్రత్యేకాధికారులు, ఐకేపీ ఏపీఎం, సంక్షేమ శాఖల తరపున సిబ్బంది, బ్యాంకు అధికారులకు స్థానం కల్పించారు. అయినా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో కమిటీలు నిస్సహాయ స్థితిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఉపాధి కల్పన లక్ష్యంగా రాయితీ రుణం కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువత మాత్రం 4 నెలలుగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు

సామాజికవర్గం	దరఖాస్తులు	యూనిట్ల లక్ష్యం
ఎస్సీ	16,300	6,201
ఎస్టీ	2,196	1,594
బీసీ సంక్షేమ శాఖ	37,935	13,400
మైనార్టీలు	10,217	3,415

నిధుల్లేక.. నీరసం..!

భారమవుతున్న పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల నిర్వహణ

- విడుదల కానీ హెచ్‌డీఎస్ నిధులు
- వసతుల్లేక రోగులకు తప్పని తిప్పలు
- నగర శివారుల్లో 38 అర్బన్, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 70పల్లె, 112 బస్తీ దవాఖానాలు



సాక్షి,మేడ్చల్ జిల్లా : నిధుల లేమితో నగర శివారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ భారమవుతోంది. ప్రభుత్వం ఏటా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ) ద్వారా ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.1.75 లక్షలు అందజేస్తోంది. అయితే ఈ నిధులు కూడా 3 లేదా 6 నెలలకు ఒకసారి విడుదల చేస్తుండడంతో ఆరోగ్య కేంద్రాల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లా వైద్యారోగ్య శాఖ సకాలంలో నిధులు విడుదలపై శ్రద్ధ చూపకపోవటంతో.. వసతుల్లేక రోగులకు తిప్పలు తప్పడం లేదు. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 38 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 26 యూపీహెచ్‌సీలు ఉండగా, పీహెచ్‌సీలు 12 ఉన్నాయి. వీటి పరిధిలో 70 పల్లె దవాఖానాలు, 112 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. అలాగే, 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు రోగులకు 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నాయి. అయితే నిధుల లేమితో ఇన్‌పెషంట్లకు తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల వసతి కల్పించలేని దుస్థితి ఏర్పడుతోంది. ఇటీవల కలెక్టర్ పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడం, అపరిశుభ్రంగా ఉండడంతో జిల్లా వైద్యాధికారిని ఆరా తీసిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. .అంతేగాకుండా వివిధ రకాల పరీక్షలను బయటకు రాస్తుండటంతో ఇక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండి.. లాభమేంటన్న ప్రశ్నలు పలువురి నుంచి ఉత్పన్నమవుతున్నాయి. నిధులు విడుదల కాకపోవడం వల్లే ఆరోగ్య కేంద్రాల నిర్వహణ కష్టమవుతోంది.
- దీనిని గుర్తించిన కలెక్టర్ తన నిధి నుంచి తక్షణమే ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు నిధులు విడుదల చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నారు. ఈ విషయమై పీహెచ్‌సీ సిబ్బంది మాత్రం ప్రభుత్వం నుంచి నిర్వహణ నిధులు రావడం లేదని పేర్కొంటున్నారు. ఇవేగాకుండా ఇతర పథకాలకు సంబంధించిన నిధులు కూడా విడుదల కాలేదంటున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. నిధులు విడుదల కాగానే సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతుల పరంగా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూస్తామని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

కొత్తందాల కుంట..



కొత్తకుంట చెరువు



చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్

చందానగర్ : హఫీజ్‌పేట్ డివిజన్ కొత్తకుంట చెరువు ఆహ్లాదాన్ని పంచుతోంది. గతంలో చుట్టు పక్కల కాలనీల నుంచి మురుగునీరు నేరుగా కొత్తకుంట చెరువులోకి చేరేవి. స్థానికుల వినతి మేరకు ఎమ్మెల్యే స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడి చెరువు సుందరీకరణకు చర్యలు తీసుకున్నారు. మురుగు నీటి కోసం ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి చెరువులో చేరకుండా మళ్లించారు. యుద్ధ ప్రతిపాదికన సుందరీకరణ పూర్తి చేశారు. చెరువు చుట్టు పూల మొక్కలు నాటారు. ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేశారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్‌నగర్, వినాయకనగర్ కాలనీలవాసులు నిత్యం చెరువు వద్దకు వస్తున్నారు. రోజు ఉదయం, సాయంత్రం సమయాలలో వృద్ధులు వాకింగ్, యువకులు ఓపెన్ జిమ్, చిన్నారులు ఆడుకుంటున్నారు. మహిళలు వాకింగ్ చేయడానికి వస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా సందడిగా మారింది.



చిన్నారుల ఆట వస్తువులు, బెంచీలు

అహింసా మార్గంలో నడవాలి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: గాంధీ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్1లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా ప్రపంచానికి మార్గదర్శనంగా గాంధీ నిలుస్తారని, అహింసే ఆయుధంగా స్వాతంత్ర్యం సాధించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ప్రతి ఒక్కరూ అహింసా మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఓనం వేడుకలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని ఎంఎంఆర్ గార్డెన్స్‌లో ఓనం వేడుకలు బోయిన్‌పల్లి మల్యాలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఎండబ్ల్యూ చైర్మన్ అబుకుట్టి నాయర్, కార్యదర్శి బాబు, గోశి పద్మనాభం, వేణుగోపాల్ నాయక్, ప్రకాష్ నాయర్, కనకరాజు పాల్గొన్నారు.

5న 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్ నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటలవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'హోలిస్టిక్ ట్రయాంగిల్ ఆఫ్ హీలింగ్ బ్యాక్ పెయిన్' అనే అంశంపై ఒడిశా యూత్ ఐకాన్-2018, బెస్ట్ ఫిజియోథెరపిస్ట్-2017 గుర్తింపు పొందిన ప్రొఫెసర్ డాక్టర్ ప్రేమ్‌రంజన్ ఓజా ఉపన్యాసం ఇస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

సామాజిక సేవలో భాగస్వాములవ్వాలి



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న నిర్వాహకులు

మోతీనగర్: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని తామర కార్పొరేషన్ ట్రస్ట్ చైర్ పర్సన్ రాధికా రెడ్డి అన్నారు. సేవా భారతి పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ 19వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం మూసాపేట డివిజన్ మోతీనగర్ శంకరమఠం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. 19 సంవత్సరాల నుంచి విద్యా, వైద్యం, ఉపాధి లక్ష్యంగా పనిచేస్తున్న సేవా భారతి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు ఎంతో ఆదర్శమన్నారు. రాబోయే రోజుల్లో సేవా భారతితో కలిసి పని చేస్తామని తెలిపారు. అనంతరం నలుగురి మహిళలకు కుట్టమిషన్లు, 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను అందజేశారు. కార్యక్రమంలో సుమన్ టీవీ డైరెక్టర్ డి. నిఖిల్, ఎంసీహెచ్‌ఎస్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.వి. ప్రసాద్, సేవ భారతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్. బి. సీతారామయ్య, వైస్ చైర్మన్ బైరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు, ట్రస్టీలు సీఎస్‌ఆర్ మూర్తి, పీఏఎస్ మూర్తి, రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పరిశీలన

ఓల్డ్‌బోయిన్‌పల్లి: శాంతినికేతన్ కాలనీ మెయిన్ రోడ్డులో డ్రైనేజీ పనులను కార్పొరేటర్ నరసింహయాదవ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎమ్మెల్యే సహకారంతో స్థానికుల అభ్యర్థన మేరకు డ్రైనేజీ లైన్లను మెయిన్ మ్యాన్‌హోల్‌లో కలిపే నిర్మాణ పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు నరసింహాచారి, వీరమణి, యాదగిరియాదవ్, గోపీనాథ్, మోహన్‌రావు, నర్సింగ్ రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ నరసింహ యాదవ్

అయ్యప్ప స్వాములకు అన్నదానం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని పోచమ్మ దేవాలయం వద్ద అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ప్రారంభించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..అయ్యప్ప స్వామి కృపా కటాక్షాలతో అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అయ్యప్ప దీక్షాపరులకు ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు.

డీసీఎం బోల్తా



మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు కట్టపై శుక్రవారం ఉదయం అట్టముక్కల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం బోల్తాపడింది. కైత్లాపూర్ నుంచి కూకట్‌పల్లికి ఏపీ 28 డబ్ల్యూ 4823 నెంబర్ గల డీసీఎం లోడ్‌తో సహా ట్రాలీ సడెన్‌గా కిందపడింది. ఎవరికీ గాయాలు కాలేదు. వెంటనే కూకట్‌పల్లి పోలీసులు జేసీబీతో ట్రాలీని సరిచేసి పంపించారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

బాలానగర్: పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటన గురువారం ఉదయం జరిగింది. బాలానగర్ సీఐ నర్సింహ రాజు వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరా నగర్, ఐడీపీఎల్ హట్స్‌లో పేకాడుతున్నారని విశ్వసనీయ సమాచారంతో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. సిరిపురం కొండల్‌రావు (24), కోట చిన్నబాబు(45), లక్ష్మీ నారాయణ (26), బి. శివ (29), వి. వెంకటరమణలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.38,530 నగదుతో పాటు ఐదుదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా విజయదశమి

- శమీ పూజలో పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు

కూకట్‌పల్లి, జోన్‌బృందం : విజయదశమిని నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగాన నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శంచుకున్నారు. భక్తిశ్రద్ధలతో శమీ పూజ చేశారు. జమ్మి ఆకును పంచి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాత్రి జరిగిన రావణాసుర దహనం కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి రామాలయం వద్ద రావణ దహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, మాజీ కార్పొరేటర్ రంగారావు



అంబీర్ చెరువు కట్టపై కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణ దహనంలో పాల్గొన్న పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు



వి. రామారావునగర్‌లోని దేవాలయంలో శమీ పూజలో పాల్గొన్న స్థానికులు



కబీర్‌నగర్ చౌరస్తాలో రావణ దహనంలో పాల్గొన్న నాయకులు



పాపారాయుడు నగర్ చౌరస్తాలో జెండాను ఎగురవేసిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, వద్దేపల్లి రాజేశ్వరరావు, జూపల్లి సత్యనారాయణ



బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావుకు దసరా శుభాకాంక్షలు తెలిపి సన్మానిస్తున్న సీహెచ్. హనుమంతరావు, మాధవరం కాంతారావు



అమ్మవారి ఆలయంలో పూజలో పాల్గొన్న టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం